ముస్తాఫా.. నోరు అదుపులో పెట్టుకో!

భూములను ఆక్రమించింది నిజంకాదా?

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న పగడాల నాగరాజు

ఖమ్మం, మార్చి 3: ఖమ్మం కార్పొరేషన్ పరిధి 57వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ ఫరీదాబేగం భర్త ముస్తాఫా ప్రభుత్వ భూములను ఆక్రమించిన విషయాన్ని బయటపెట్టినందుకు అక్కసుతో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే సహించేది లేదని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు హెచ్చరించారు. సోమవారం ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రమణగుట్ట ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ముస్తాఫా ఆక్రమించిన విషయాన్ని మీడియా ద్వార అధికారులకు తెలియజేశానన్నారు. ఈ మేరకు ఆర్డీవో, తహసీల్దార్ వచ్చి పరిశీలించి అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తనపై అబద్ధపు ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హితువు పలికారు. ముస్తాఫా అరాచకాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరిస్తానని తెలిపారు. సమావేశంలో రమణ గుట్టకు చెందిన స్థానికులు పెద్దభిక్షం, రాజు, కనకయ్య, పుల్లారావు, రామ్మూర్తి, రాములు, చిలక శ్రీను, వీరబాబు పాల్గొన్నారు.

నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలి

- ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం అర్బన్, మార్చి 3 : డీఈడీ దశలో ప్రతి విషయం పైనా అధ్యయనం చేసి నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకుంటే టీచర్‌గా భవిశ్యత్తులో రాణించగలుగుతారని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి డైట్ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆయన టేకులపల్లిలోని డైట్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై కాసేపు ముచ్చటించారు. రెండేళ్ల డీఈడీ కోర్సు ఎంతో ముఖ్యమైనదని, ప్రతి అంశాన్ని నేర్చుకోవాలనే తపనను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, డైట్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అర్బన్ శైలజాలక్ష్మి, ఏఎంవో కేశవ పట్నం కవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు: ఆర్ఐ

ప్రభుత్వ స్థలంలో బోర్డు పెడుతున్న ఆర్ఐ, సిబ్బంది

ఖమ్మం రూరల్, మార్చి 3: ప్రభుత్వ భూమిని అక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఖమ్మం రూరల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ప్రసాద్ స్పష్టం చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ టీఎన్‌జీవోస్ కాలనీ వెనుక ఉన్న సర్వే నంబర్ 87లోని భూమిని రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. 'ఇది ప్రభుత్వ భూమి' అంటూ సదరు స్థలంలో బోర్డు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 87లోని ఐదెకరాల సీలింగ్ భూమిని 2004లో అప్పటి తహసీల్దార్.. ప్రభుత్వానికి స్వాధీనం చేశారని, దాని సీలింగ్‌ను రద్దు చేస్తూ అప్పుడే ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారని వివరించారు. ఇటీవల ఈ భూమి ఆక్రమణులకు గురవుతున్న నేపథ్యంలో తహసీల్దార్ రాంప్రసాద్ ఆదేశాల మేరకు బోర్డు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

స్ట్రీటీ పాయింట్‌ను పరిశీలించిన డీపీఎం

కారేపల్లి, మార్చి 3: స్వయం సహాయక సంఘం సభ్యులకు మంజూరైన స్ట్రీటీ పాయింట్ స్థలాన్ని డీఆర్‌డీవో డీపీఎం పొట్టిపింజర రామయ్య సోమవారం సందర్శించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న టీస్టాల్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు రకాల వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు తుమ్మలపల్లి అనిల్, భూక్యా చైతన్య తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పైరు పరిశీలన

బోనకల్లు, మార్చి 3: మండలంలో సాగుచేస్తున్న మొక్కజొన్న పైర్లను మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సోమవారం పరిశీలించారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సాగర్ కెనాల్ కింద రైతులు సాగుచేసిన మొక్కజొన్న పైరును ఆయన పరిశీలించి రైతులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ సాగర్‌జలాలు పూర్తిస్థాయిలో రాకపోవడం వల్ల కాలువ పరిధిలో గల చివరి భూములకు సాగునీరు అందడం లేదని, వెంటనే విడుదల చేయాలని రైతులు కోరారు. స్పందించిన ఏడీఏ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సాగర్‌జలాలను చివరి భూములకు అందేలా సరఫరా జరిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో పసులూరి వినయ్‌కుమార్, ఇరిగేషన్ జేఈలు రాజేశ్, ఏడుకొండలు, ఏఈవో రజిత, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధిర(చింతకాని), మార్చి 3: టీజీ గ్రామీణ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని టీజీ గ్రామీణ బ్యాంక్ రీజినల్ ఆఫీసర్ టీ శ్రీహరి కోరారు. సోమవారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో పెంట్యాల పుల్లయ్య భవనంలో ఏర్పాటు చేసిన బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులకు గ్రామీణ బ్యాంక్ అందుబాటులో ఉంచేందుకు బ్రాంచ్‌ని ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, బ్రాంచ్ మేనేజర్ ఎం రమేశ్, ఫీల్డ్ ఆఫీసర్ కే సతీశ్, క్యాషియర్ వీ.అభిల్, ఖాతాదారులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టులో ప్రియదర్శిని విద్యార్థులు ప్రతిభ

ఖమ్మం రూరల్, మార్చి 3: సైన్స్ దినోత్సవం సందర్భంగా తమ కళాశాల విద్యార్థినులు ప్రాజెక్టుల తయారీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కాటెపల్లి నవీన్‌బాబు తెలిపారు. స్థానిక ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో 'ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, డేటా సైన్స్' విభాగంలో బీ శ్రావణి (కిసాన్ యంత్ర) ప్రాజెక్టుకు ద్వితియ స్థానం, కవిత మెమోరియల్ డిగ్రి కళాశాల నిర్వహించిన పోటీలో 'ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, సైన్స్' విభాగంలో బీ శ్రావణి, వీ భాను, అక్షయ, కే శ్రీలాహరిల ప్రాజెక్టులకు తృతీయ స్థానం లభించిందన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ బీ గోపాల్, డైరెక్టర్ వెంకటరమణ, ఆయా విభాగల అధిపతులు అభినందించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎర్రుపాలెం, మార్చి 3: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కోగంటి సాయిరాం(29) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం తన ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని మృతిచెందాడని ఎస్సై పీ.వెంకటేశ్ తెలిపారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

యాసంగి పంటల సంరక్షణకు పటిష్టచర్యలు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, మార్చి 3 : యాసంగి పంటల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి యాసంగి పంటలకు సాగునీటి సరఫరా, గురుకులాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు, ప్లాస్టిక్ ఫ్రీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాబోయే 10రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోటు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈలు వాసంతి, ఎం.వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత భోజనం

కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులకు ఉచిత భోజన సదుపాయాన్ని మార్చి 5వ తేదీ నుంచి కల్పించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నం, ఆకుకూర పప్పు, రోటి, పచ్చడి, 2 కూరలు, సాంబార్, రసం, పెరుగుతో మంచి భోజనం దివ్యాంగులకు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఉన్న వివిధ కార్యాలయాలకు కూపన్లు పంపిణీ చేస్తామని, 40శాతం వైకల్యం గల దివ్యాంగులకు వీటిని జారీ చేయాలని సూచించారు. ఒక్కొక్క భోజనానికి రూ.80 చొప్పున క్యాంటీన్‌కు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు జి.ఉషశ్రీ, కార్యదర్శి పి సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మార్చి 8వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వివిధ క్రీడల పోటీలు ఉంటాయని తెలిపారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

ఖమ్మం, మార్చి 3 : విద్యుత్ వినియోగదారుల కోసం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం చేపడుతున్నట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఈ.శ్రీనివాసచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. 2024 జూన్ 17న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని ముఖ్య కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గం టల వరకు ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు.

పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు

ఖమ్మం, మార్చి 3 : పోలీస్ సిబ్బంది సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగుబండి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ ప్రత్యూ ష ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఏఆర్ ఏసీపీ నర్సయ్య తెలిపారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్, మార్చి 4 : ఖమ్మం నగరానికి చెందిన కొదుమూరు శ్రీనివాసరావు రూ.2 కోట్ల 48లక్షల 80 వేలకు సోమవారం దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. శ్రీనివాసరావు బియ్యం వ్యాపారంలో నష్టాలు రావడంతో 64మంది ప్రతివాదులను రుణదాతలుగా పేర్కొంటూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయవాదులుగా కోనా చంద్రశేఖర్‌గుప్తా, శరణ్య, సాయికిరణ్ వ్యవహరిస్తున్నారు.

ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులున్నా..ఆగని మట్టి తోలకాలు

- హద్దులు నిర్ణయించాకే తోలకాలకు అనుమతివ్వాలన్న హైకోర్టు
- నెల రోజుల విరామం తర్వాత మళ్లీ మొదలైన గ్రావెల్ తోలకాలు
- రెండుసార్లు నోటీసులిచ్చినా బాధితుడు రాలేదన్న తహసీల్దార్

ముదిగొండ, మార్చి 3: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులున్నప్పటికీ మట్టి తోలకాలు మాత్రం ఆగడం లేదు. హద్దులు నిర్ణయించాకే తోలకాలకు అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు రావడంతో.. సుమారు నెల రోజులపాటు నిలిచిపోయిన గ్రావెల్ తోలకాలు తాజాగా మళ్లీ మొదలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని కమలాపురం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 259లో ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ భూమిని ఆనుకొని అదే గ్రామానికి చెందిన బత్తుల వీరారెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు సాగుభూమి ఉన్నది. అయితే, మండలంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల కోసం సంబంధిత వ్యక్తులు ప్రభుత్వ అనుమతులతో గత డిసెంబర్ నుంచి ఆ ప్రభుత్వ భూమి నుంచి గ్రావెల్ తోలుకుంటున్నారు. అయితే, ఆ ప్రభుత్వ భూమికి ఆనుకొని ఉన్న తన పట్టాభూమి నుంచి సంబంధిత వ్యక్తులు గ్రావెల్‌ను తరలిస్తున్నారంటూ బాధిత రైతు వీరారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశాడు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అయితే, ప్రభుత్వ భూమిని, పట్టా భూమిని సర్వే చేయాలని; హద్దులు నిర్ణయించాకే ప్రభుత్వ భూమి నుంచి గ్రావెల్ తోలకాలకు అనుమతి ఇవ్వాలని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం.. రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ ఏడాది జనవరిలో తోలకాలను నిలుపుదల చేయించారు. అయితే వారం రోజులుగా సంబంధిత వ్యక్తులు ఎక్కడ తవ్వకాలు ఆపారో మళ్లీ అక్కడి నుంచే తోలకాలు మొదలుపట్టారు. ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు.

రైతుకు రెండుసార్లు నోటీసులిచ్చాం: తహసీల్దార్

కోర్టు ఉత్తర్వులు అందాక సర్వే చేసేందుకు సదరు రైతుకు రెండుసార్లు నోటీసులిచ్చాం. ఆ రెండుసార్లూ ఆ రైతు అందుబాటులో లేడు. ఇంతలో సర్వేయర్ డిప్యూటేషన్‌పై ఉండడంతో మరోసారి సర్వేచేసేందుకు వీలు కాలేదు. త్వరలోనే మరోసారి సర్వే చేస్తాం. మళ్లీ మట్టి తోలకాలు జరుపుతున్నట్లు నా దృష్టికి రాగానే వాటిని నిలిపివేయాలని మా సిబ్బందిని ఆదేశించాను.

పెద్దాసుపత్రిలో అరుదైన ఆపరేషన్

వృద్ధురాలికి మోకీలు మార్పిడి

ఖమ్మం సిటీ, మార్చి 3 : ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ జరిగింది. ప్రైవేట్‌లో లక్షలాది రూపాయల ఖరీదైన వైద్యసేవలను సర్కారు వైద్యులు ఉచితంగా అందించారు. రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం గ్రామానికి చెందిన 65సంవత్సరాల జీ.నాగమణి రిమోటైర్డ్ ఆర్థరైటిస్(మోకీలు నరములు) సమస్యతో గత ఐదేండ్లుగా బాధపడుతున్నది. కొద్దిరోజుల క్రితం ఖమ్మం పెద్దాసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు అన్నిరకాల పరీక్షల అనంతరం అత్యంత క్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆమె సంపూర్ణ ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. సర్జరీ ప్రక్రియలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ హనుమాన్‌సింగ్, డాక్టర్ మదన్‌సింగ్, డాక్టర్ విజయ్, డాక్టర్ నాజిం, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ విజయ్, హెచ్‌వోడీ డాక్టర్ రవి, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. వైద్య బృందాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేశ్వర రావు, రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

ఉషు పోటీల్లో పవిత్రచారికి సిల్వర్ మెడల్

పవిత్రచారిని అభిందిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సిటీ, మార్చి 3 : ఆలిండియా యూనివర్శిటీ ఉషు సీనియర్ పోటీల్లో ఖమ్మానికి చెందిన పొడకంటి పవిత్రాచారి సిల్వర్ మెడల్ గెలుచుకుంది. గత నెలాఖరులో చండీఘర్ యూనివర్శిటీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు దేశంలోని 131 యూనివర్శిటీలకు చెందిన దాదాపు 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం హైదరాబాద్ తరపున ఖమ్మం పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేస్తూ అంచలంచెలుగా ఎదిగిన పవిత్రాచారి హాజరైంది. ఆయా పోటీల్లో తనదైన శైలిలో రాణించి సిల్వర్ మెడల్ సాధించింది. ఆమెను, ప్రధాన కోచ్ పొడకంటి పరిపూర్ణాచారిని సోమవారం అదనపు కలెక్టర్ పిన్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన, క్రీడలశాఖ అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఖమ్మానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

కొణిజర్ల, మార్చి 3: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పెసర ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొణిజర్ల ఆశ్రమ హైస్కూల్ పాఠశాలలో ఖమ్మంలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోతరగతి పరీక్ష పత్రము నమూనా, ఆయా సబ్జెక్టు విషయాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవశాస్త్రం రాష్ట్ర రిసోర్స్ పర్సన్, పాఠ్యపుస్తకాల రచయిత పెసర ప్రభాకర్‌రెడ్డి ఉపాధ్యాయులకు పదోతరగతి పాఠ్యపుస్తకం, పబ్లిక్ పరీక్షల పట్ల ఎలాంటి మెలకువలు పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం టీఏడబ్ల్యూ సత్యవతి, వైరా ఏటీడబ్ల్యూ జహీరుద్దీన్, ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ధర్మ. జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస సదస్సు

ఖమ్మం అర్బన్, మార్చి 3 : జీవితం ఒకేసారి లభించిన వరమని, నిరంతర తపన, పట్టుదల, ఏకాగ్రతలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని రాజేంద్రనగర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిగొండకు 50 పడకల ఆస్పత్రి మంజూరు

ముదిగొండ, మార్చి 3: ముదిగొండకు 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రి నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ. 22 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ముదిగొండ పీహెచ్‌సీలో ఆరు పడకలు అందుబాటులో ఉండగా కేవలం అవుట్ పేషంట్ సేవలు మాత్రమే అందిస్తున్నారు.

యువతకు సాధికారత కల్పించడంపై అవగాహన

కొణిజర్ల, మార్చి 3: మండలంలోని తనికెళ్లలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ 'విక్షిత్ భారత్ కోసం సైన్స్ ఆవిష్కరణలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువత సాధికారత కల్పించడం' అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.మోహన్‌రావు , ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ కే.లక్ష్మారెడ్డి, అసిస్టెం ట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రజిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ కే.పీ.ఐశ్వర్యరాణి, సీజీసీ కోఆర్డినేటర్ కే.రజిని, ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఇన్‌చార్జి బీ.రాజేశ్వరి పాల్గొన్నారు.

వాహనదారులు ధ్రువపత్రాలుకలిగి ఉండాలి

ఎర్రుపాలెం, మార్చి 3: వాహనదారులు తప్పనిసరిగా వాహనాల ధ్రువపత్రాలను కలిగి ఉండాలని మధిర సీఐ మధు పేర్కొన్నారు. సోమవారం ఎర్రుపాలెం గురుకుల పాఠశాల సమీపంలో ఎస్సై వెంకటేశ్‌తో కలిసి సీఐ వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ధ్రువపత్రాలు లేని వాహనాలు, హెల్మెట్, మద్యం తాగి వాహనాలను నడపకూడదని, అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైలోబంకర్ తీసేసే వరకు ఆందోళన నిర్వహించాలి

శిబిరంలో మాట్లాడుతున్న కల్యాణం వెంకటేశ్వరరావు

సత్తుపల్లిటౌన్, మార్చి 3: రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు లక్షలాది మంది రైతులు ఏడైతే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఏడాదిగా ఉద్యమించి విజయం సాధించారో అదే స్ఫూర్తితో సైలోబంకర్‌ను తీసే వరకు ఆందోళనను ముందుకు తీసుకెళ్లి విజయం సాధించుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సైలో బాధితులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతును తెలిపారు. సైలో బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి వల్ల ప్రభావిత ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే సైలోబంకర్ రూపంలో అనేక రకాల సమస్యలతో పాటు ప్రజల అనారోగ్యాలకు పాలయ్యేలా సింగరేణి వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. కచ్చితమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలను అపవద్దన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి సైలోబంకర్ బాధితుల సమస్యను తీసుకెళ్లి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చలమాల విఠల్‌రావు, సీపీఎం నాయకుడు జాజిరి శ్రీనివాస్, పెనుబల్లి మండల సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు 600 మందితో కాలినడకన కిష్టారం నుంచి సత్తుపల్లికి

కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీకాలనీలకు చెందిన సైలోబంకర్ బాధితులు మంగళవారం 600 మందితో కిష్టారం నుంచి సత్తుపల్లి వరకు కాలినడకన ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శన సత్తుపల్లి బస్టాండ్ చౌరాస్తా వరకు అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని వినతిపత్రం అందజేయనున్నారు.

ఫలితాలే కాకుండా క్రమశిక్షణ ముఖ్యం

సత్తుపల్లిటౌన్, మార్చి 3: నేటి తరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలతోనే కాకుండా క్రమశిక్షణ, మంచి నడవడికతో ఎదగాలని సీఐ కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో త్రివేణి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ చదువుకు సమాంతరంగా, క్రీడలు, ఆసక్తి, నైపుణ్యం గల రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలకు చేయూతనివ్వాలన్నారు. విద్య సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ ఒత్తిడిలో కూడిన విద్యను వదిలి విద్యార్థులు ఇష్టపడి చదివేలా తమ పాఠశాల విద్యా విధానాన్ని రూ పొందించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క